నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 2 జూన్ 2024 RANGAREDDY



మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

## వర్షాకాలానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, జూన్ 1(నమస్తే తెలంగాణ) : రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లను రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే వర్షా కాలంలో జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో ముంపును అంచనా వేసి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో, రోడ్ల పైన వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ముంపు ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని నాలాల్లో చెత్త లేకుండా శుభ్రం చేయించాలన్నారు. కాలనీల్లో పర్యటించి ప్రజలతో చర్చించి వర్షాకాలంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ పనులు జరుగుతుంటే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ప్రమాదాలు జరుగకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే ప్రాంతాలను గుర్తించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు సంబంధిత శాఖల వారితో కలిసి సమన్వయంతో పనులు నిర్వహించాలన్నారు. ఎమర్జెన్సీ టీముల్లో ఇరిగేషన్ వారిని భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**ముస్తాబైన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం**

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న జిల్లా కలెక్టర్ శశాంక**

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముస్తాబైంది. కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. అవతరణ వేడుకల సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ శశాంక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.







# బ్లాక్ దందాపై నజర్

**పత్తి విత్తనాల కొరత రాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి**

**డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను బ్లాక్‌లో విక్రయించకుండా పకడ్బందీ చర్యలు**

**రైతుల అవసరం మేర అందుబాటులో పత్తి విత్తనాలు**

**కొన్ని కంపెనీల పత్తి విత్తనాలకు కావాలనే ప్రచారం**

**ప్రచారాన్ని నమ్మి రైతులు ఇబ్బందులు పడొద్దని అధికారుల సూచన**

**నకిలీ విత్తనాలపై వ్యవసాయ, పోలీస్ అధికారులతో ప్రత్యేక నిఘా**

**జిల్లాకు అవసరమైన పత్తి విత్తన ప్యాకెట్లు -5,45,000**

**జిల్లాలో అందుబాటులో 3,14,525 ప్యాకెట్లు**

**ఇప్పటివరకు 59,458 పత్తి విత్తనాల ప్యాకెట్లను కొనుగోలు చేసిన రైతులు**



వికారాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నా.. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఫర్టిలైజర్ డీలర్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక నజర్ పెట్టింది. ఇతర జిల్లాల్లో పత్తి విత్తనాల కొరత ఉన్న దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. జిల్లా రైతాంగం ఇబ్బందులు పడకుండా అవసరం మేర పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. రేవంత్ లాంటి కొన్ని పత్తి విత్తనాల కంపెనీలకు సంబంధించి అధిక దిగుబడి వస్తుందంటూ కావాలనే ప్రచారం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుండడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. పత్తి విత్తనాలకు సంబంధించి ప్రచారాన్ని నమ్మి ఇబ్బందులు పడకుండా ఏ కంపెనీ పత్తి విత్తనాలతో సాగు చేసినప్పటికీ దిగుబడి ఒకేలా వస్తుందని, సాగును బట్టి దిగుబడిలో మార్పు ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని రైతులకు తెలిసేలా జిల్లావ్యాప్తంగా వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కృత్రిమ డిమాండ్‌ను కల్పించిన రేవంత్ పత్తి విత్తనాలకు సంబంధించి జిల్లాలో ఏ డీలర్ కూడా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకుగాను జిల్లాకు ఆనుకొని ఉన్న కర్ణాటక సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాల బారిన పడి రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలను జిల్లా ఉన్నతాధికారులు చేపట్టారు. మరోవైపు పత్తితోపాటు ఇతర పంటలను సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కొందరు నకిలీ పత్తి విత్తనాలను రైతులకు నేరుగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని, రైతులెవరూ కొనుగోలు చేయవద్దని, మరోవైపు నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకుగాను జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా పెట్టింది.

### అందుబాటులో 2,55,067 పత్తి విత్తనాల ప్యాకెట్లు..

జిల్లాలో సరిపోను పత్తి విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పత్తి విత్తనాల విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు స్టాక్ చూసుకుంటూ అవసరం మేర పత్తి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లాలో వానకాలం సీజన్‌లో 5,45,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లాకు ఇప్పటివరకు 3,14,525 ప్యాకెట్ల పత్తి విత్తనాల స్టాక్ జిల్లాకు ప్రభుత్వం సరఫరా చేయగా, ఇప్పటివరకు జిల్లా రైతాంగం 59,458 పత్తి విత్తనాల ప్యాకెట్లను కొనుగోలు చేసింది. మరో 2,55,067 పత్తి విత్తనాల ప్యాకెట్లు జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వరికి సంబంధించి 27,500 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న 4036 క్వింటాళ్లు, పెసర్లు-1040, కందులు-4500 క్వింటాళ్లు, మినుములు-400 క్వింటాళ్లు, సోయాబీన్-750 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈ వానకాలం సీజన్‌కుగాను జిల్లా వ్యవసాయాధికారులు రూపొందించిన సాగు ప్రణాళికకు సరిపడా ఎరువులను కూడా అందుబాటులో ఉంచేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలో పీఏసీఎస్, డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులను సరఫరా చేసేందుకు నిర్ణయించారు. వానకాలం సీజన్‌కుగాను యూరియా, డీఏపీ, ఎన్‌పీకేఎస్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ ఎరువులు అన్ని కలిపి 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 19,877 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని సంబంధిత అధికారులు అంచనా వేయగా, జిల్లాలో ఇప్పటివరకు యూరియా 15,317 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1273 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2477 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 192 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 106 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలోని గోదాముల్లో నిల్వ ఉంచారు.

### వానకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను రూపొందించారు. పత్తి 2,63,500 ఎకరాలు, కంది 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 50,450 ఎకరాలు, వరి 1.10 లక్షల ఎకరాలు, మినుములు 5 వేల ఎకరాలు, సోయాబీన్ 2500 ఎకరాలు, జొన్నలు-2500 ఎకరాలు, పెసలు 13 వేల ఎకరాల్లో సాగవుతుందని ప్రణాళికను రూపొందించారు. గతేడాది వానకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 5.81 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగుకాగా, వరి-1,34,857 ఎకరాలు, మొక్కజొన్న-55,751, జొన్న-2033 ఎకరాలు, కందులు-1,31,284 ఎకరాలు, పెసలు-13,453 ఎకరాలు, మినుములు-5175 ఎకరాలు, పత్తి-2,30,285 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

### అందుబాటులో సరిపోను పత్తి విత్తనాలు..



వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో సరిపోను పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాం. ఎలాంటి కొరత లేదు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకుగాను తగు చర్యలు తీసుకున్నాం. నకిలీ విత్తనాలపై రైతులు కూడా అవగాహన పెంచుకోవాలి. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తాం. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి ప్రతీ ఒక్కరూ రసీదులు తీసుకోవాలి.

– నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్



గన్‌పార్కు నుంచి అమరవీరుల స్తూపం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

## కనుల పండువగా కొవ్వొత్తుల ర్యాలీ

**పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని గన్‌పార్క్ నుంచి అమరవీరుల స్తూపం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జెర్కోని రాజు, ఐలయ్య, జానిపాషా, కానుగుల మహేశ్, రఘుపతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



గన్‌పార్కు నుంచి అమరవీరుల స్తూపం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితాలు

షాద్‌నగర్, జూన్1 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగానే అన్ని పార్టీల నేతలు ఉప ఎన్నికకు సిద్ధమైన విషయం తెలిసిందే. ప్రధానంగా అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి పోటీలో నిలిచారు. గత మార్చి28న ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మార్చి 28న పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల కమిషన్ ఫలితాలను జూన్ 2న వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో నేడు వెలువడే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఇరు పార్టీల్లో ఉత్కంఠ నెలకొన్నది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారని, ఫలితం సాయంత్రం నాలుగు గంటల వరకు వెలువడే అవకాశం ఉన్నదని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1437 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 14 మంది ఎమ్మెల్యేలు, 83 మంది జడ్పీటీసీలు, 888 మంది ఎంపీటీసీలు, 449 మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. ఇద్దరు ఎంపీటీసీలు తమ వ్యక్తిగత కారణాలతో ఓటు హక్కును వినియోగించుకోలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓటర్లు అధికంగా ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఓటర్లు మాత్రం బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపారని ప్రచారం జరుగుతున్నది. గెలుపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



విద్యుత్ కాంతుల్లో జిగేల్‌మంటున్న రంగారెడ్డి కలెక్టరేట్



విద్యుత్ కాంతులీనుతున్న ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్

## అవతరణోత్సవ ధగ ధగలు

**ఆవిర్భావ వేడుకలకు ఉమ్మడి జిల్లా ముస్తాబు**

తెలంగాణ దశాబ్ది వేడుకలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముస్తాబైంది. కలెక్టరేట్‌లతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. రాత్రి విద్యుద్దీపాలు జిగేల్ మంటూ కనువిందు చేశాయి.



విద్యుత్ దీపాల వెలుగుల్లో బొంరాస్‌పేట మండల కార్యాలయాలు